నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, శుక్రవారం 5 ఏప్రిల్ 2024 | RANGAREDDY

వికారాబాద్ జిల్లాలో స్త్రీనిధి, లింకేజీ రుణాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

వికారాబాద్ జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి 10352 మహిళా స్వయం సహాయక సంఘాలకు అందించాల్సినది రూ.462.29 కోట్లు

9060 సంఘాలకు అందించినది రూ.482.80 కోట్లు..

స్త్రీనిధి రుణాలు రూ.37.98 కోట్లు పంపిణీ

లక్ష్యానికి మించి..

మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు

బొంరాస్‌పేట, ఏప్రిల్ 4 : మహిళా స్వయం సహాయక సంఘాలకు ఏటా ప్రభుత్వం ఇస్తున్న బ్యాంకు లింకేజీ రుణాలను జిల్లా అధికార యంత్రాంగం నిర్దేశించిన లక్ష్యం కంటే ఎక్కువగా పంపిణీ చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వికారాబాద్ జిల్లాలోని 10352 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.462.29 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలను అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించగా జిల్లా అధికారులు 9060 సంఘాలకు 482.80 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను అందజేసి లక్ష్యాన్ని అధిగమించారు. ప్రభుత్వం నిర్దేశించిన దానికంటే 4.87 శాతం అధికంగా లింకేజీ రుణాలను జిల్లా అధికారులు మహిళలకు అందజేశారు. స్త్రీనిధి రుణాల పంపిణీలో లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. కేవలం 41 శాతం మేరకే స్త్రీనిధి రుణాలను మహిళలకు పంపిణీ చేశారు.

ఈ రుణాలు పొందిన మహిళలు తమ జీవనోపాధికి వినియోగించుకుని తిరిగి బ్యాంకులకు నిర్దేశించిన గడువులోగా వాయిదాల రూపంలో చెల్లిస్తున్నారు. మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకున్న లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకుంటూ తిరిగి చెల్లిస్తుండడంతో బ్యాంకులు కూడా నమ్మకంతో వారికి రుణాలను అధిక మొత్తంలో అందిస్తున్నాయి. ఏటా ఇస్తున్న బ్యాంకు లింకేజీ రుణాలు మహిళా సాధికారతకు, ఆర్థిక పరిపుష్టికి తోడ్పడుతున్నాయి.

రూ.39.98 కోట్ల స్త్రీనిధి రుణాల పంపిణీ

వికారాబాద్ జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో మహిళలకు స్త్రీనిధి ద్వారా రూ.92.24 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించగా జిల్లా అధికారులు రూ.39.98 కోట్లు మాత్రమే పంపిణీ చేశారు. స్త్రీనిధి రుణాల రికవరీ 70 శాతంగా ఉన్నది.

మండలాలవారీగా అందించిన రుణాలు

వికారాబాద్ జిల్లాలోని 19 మండలాల్లో 9060 సంఘాలకు గత ఆర్థిక సంవత్సరంలో రూ.482.80 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను అందజేశారు.

మండలం	ఇవ్వాల్సిన సంఘాలు	ఇవ్వాల్సిన రుణాలు (రూ.కోట్లలో)	పొందిన సంఘాలు	అందజేసింది (రూ.కోట్లలో)
బంట్వారం	285	11.89	203	16.12
నవాబుపేట	529	24.80	418	31.78
మోమిన్‌పేట	652	31.43	431	36.95
తాండూరు	622	26.29	634	30.25
కోట్‌పల్లి	362	15.46	283	17.28
కులకచర్ల	810	34.37	800	38.27
దోమ	660	28.19	671	31.22
యాలాల	557	24.10	515	26.56
మర్పల్లి	556	25.11	578	27.65
బషీరాబాద్	662	29.09	576	29.99
చౌడాపూర్	149	7.11	196	7.30
పరిగి	589	24.93	615	25.46
పూడూరు	608	27.84	589	28.38
పెద్దేముల్	682	31.60	470	32.07
కొడంగల్	454	19.26	409	19.53
ధారూరు	435	18.81	485	19.02
బొంరాస్‌పేట	579	25.94	526	25.92
దౌల్తాబాద్	667	31.45	450	23.42
వికారాబాద్	494	24.54	211	17.53

- రేషన్ షాపుల్లో డీలర్ల నయా దందా
- ఒకే యంత్రాన్ని వేర్వేరు దుకాణాల్లో వినియోగం
- ప్రభుత్వం ఇస్తున్న కమీషన్‌తోపాటు బియ్యాన్ని కాజేస్తున్న డీలర్లు
- జిల్లాలో ప్రతి నెలా 5.58 లక్షల కార్డులకు 11,562 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ
- ఇందులో 30 శాతం బియ్యం పక్కదారే!
- అధికారుల పర్యవేక్షణ కొరవడడమే ఇందుకు కారణం

ఈ-పాస్ మాయాజాలం!

రంగారెడ్డి, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ)/ వనస్థలిపురం : ఇప్పటివరకు బోగస్ కార్డులతో రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించడాన్ని చూశాం. అలాగే..బినామీ డీలర్లతో బియ్యం పంపిణీలో జరుగుతున్న మోసాల గురించి విన్నాం. కానీ.. పారదర్శకతకు నిదర్శనంగా చెప్పుకొంటున్న ఈ-పాస్ యంత్రాలతోనే నయా దందాను నడిపిస్తుండడం తాజాగా వెలుగులోకి వచ్చింది. కొద్దిరోజుల క్రితం ఒక షాపునకు సంబంధించిన ఈ-పాస్ యంత్రం మరో దుకాణంలో దర్శనమివ్వడంతో ఆరా తీసిన సివిల్ సప్లయ్ అధికారులకు డీలర్ల నయా దందా తెలిసొచ్చింది. జిల్లాలో మొత్తం 5.58 లక్షల రేషన్ కార్డుల కు ప్రతినెలా 11,562.725 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తున్నది. అయితే ఇందులో 30 శాతం బియ్యం వివిధ రూపాల్లో పక్కదారి పడుతున్నట్లు తెలుస్తున్నది.

వెలుగులోకి సరికొత్త దందా..

వనస్థలిపురంలోని ఓ రేషన్ షాపులో బియ్యం పంపిణీలో అక్రమాలు జరుగుతున్నాయం టూ కొద్దిరోజుల క్రితం సివిల్ సప్లయ్ అధికారులకు అందిన సమాచారం మేరకు అధికారులు అక్కడికెళ్లి తనిఖీలు నిర్వహించారు. అక్కడ మాడ్గుల మండలంలోని ఓ రేషన్ దుకాణానికి సంబంధించిన ఈ-పాస్ యంత్రం ఉండడాన్ని గుర్తించారు. వనస్థలిపురంతోపాటు మాడ్గుల మండలంలోని రేషన్ షాపుల్లో నిల్వ ఉన్న సరుకులు, పంపిణీ చేసిన బియ్యం లెక్కలను పరిశీలించగా లెక్కల్లో తేడా లేదని అధికారులు చెబుతున్నారు. దీనిపై విచారణ చేస్తున్నామని అంటున్నారు. అయితే మాడ్గుల మండలంలోని షాపునకు సంబంధించిన యంత్రం వనస్థలిపురంలో ప్రత్యక్షం కావడం మాత్రం మిస్టరీగా మారింది. చార్జింగ్ కోసమే దానిని అక్కడ పెట్టినట్లు మాడ్గుల మండల డీలర్ చెప్పి తాత్కాలికంగా తప్పించుకున్నా.. ఈ ఘటన రేషన్ డీలర్ల నయా దందాను తేటతెల్లం చేసింది.

దందా జరుగుతున్న తీరిది..

పేదలకు బియ్యాన్ని పంపిణీ చేసినందుకు డీలర్లకు క్వింటాలుకు రూ.140 లెక్కన ప్రభుత్వం చెల్లిస్తున్నది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు జిల్లాలో అధికంగా ఉండడంతో పోర్టబిలిటీ విధానం సక్సెస్‌ఫుల్‌గా సాగుతున్నది. ఇదే డీలర్లకు వరంలా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ తీసుకునే వారు తక్కువగా ఉండడంతో చాలా మంది డీలర్లు పట్టణ ప్రాంతాల్లోని రేషన్ షాపుల్లో అక్కడి ఈ-పాస్ యంత్రాలను ఉంచి బియ్యం పంపిణీ చేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వం నుంచి కమీషన్ రూపంలో డబ్బులను అక్రమంగా పొందుతున్నారు. ఇది మొదటి విడుత జరిగే వ్యవహారం. ఇక రెండోది..కార్డుదారులు వేలిముద్రలు వేశాక.. తూకంలో బియ్యం వేసినట్లు రికార్డుల్లో నమోదు చేసి డీలర్లు డబ్బులు చెల్లిస్తున్నారు. ఆ బియ్యాన్ని దొడ్డిదారిన విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ-పాస్ యంత్రం మాటున జిల్లాలో రూ.కోట్లలో అక్రమ దందా సాగుతున్నట్లు తెలుస్తున్నది. ఒక షాపులోని బియ్యాన్ని మరో దుకాణానికి సర్దుబాటు చేస్తూ అక్రమాలను కప్పిపుచ్చుతుండగా..సివిల్ సప్లయ్ అధికారుల నిరంతర పర్యవేక్షణ లేకనే నయా దందా సాగుతున్నదన్న ఆరోపణలున్నాయి.

విచారణ చేస్తున్నాం..

వనస్థలిపురం రేషన్ షాపులో మాడ్గుల మండలానికి సంబంధించిన ఈ-పాస్ యంత్రం ఉండడంపై విచారణ జరుపుతున్నాం. రెండు చోట్ల షాపుల్లో ఫిజికల్ వెరిఫికేషన్ చేశాం. స్టాక్, బియ్యం పంపిణీలో వ్యత్యాసం లేదని గుర్తించాం. ఈ-పాస్ యంత్రాలతో డీలర్లు చేస్తున్న కొత్త తరహా మోసాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం.

-సరోజ, ఏఎస్‌వో, పౌర సరఫరాల శాఖ, రంగారెడ్డి జిల్లా

ప్రతినెలా 30 శాతం బియ్యం పక్కదారి..!

జిల్లాలో అంత్యోదయ, అన్నపూర్ణ ఆహార భద్రతాకార్డులు మొత్తం 5,58,438 వరకు ఉన్నాయి. వీటికి ప్రభుత్వం ప్రతినెలా 11,562.725 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని జిల్లా లోని 932 రేషన్ షాపులకు కేటాయిస్తున్నది. ఇందుకోసం ప్రభుత్వం కిలో బియ్యానికి రూ.39.35పై వరకు ఖర్చు చేస్తున్నది. ప్రభుత్వం కేటాయిస్తున్న బియ్యంలో సుమారు 30 శాతం బియ్యం పక్కదారి పడుతున్నట్లు తెలుస్తున్నది. పట్టణాలు, గ్రామాల్లో దళారులను పెట్టుకుని తక్కువ ధరకు కొంటూ కొందరు వ్యాపారులు దందా సాగిస్తున్నారు. కొన్నిచోట్ల రేషన్ డీలర్లే నేరుగా కార్డుదారుల నుంచి కొంటున్నారు. సేకరించిన బియ్యాన్ని మిల్లుల్లో పాలిష్ చేయించి సన్నరకం బియ్యంలో కలుపుతుండగా..కొందరు మిల్లర్లు సీఎంఆర్ కింద తిరిగి ప్రభుత్వానికే అప్పగిస్తున్నట్లు సమాచారం. జిల్లాకు చెందిన రేషన్ బియ్యం చాలావరకు సరిహద్దులు దాటుతున్నది. ఔటర్ మీదుగా నేరుగా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు తెలిసింది. రేషన్ బియ్యం పంపిణీలో పారదర్శకత కోసం ప్రభుత్వం ఈకేవైసీని అమలు చేస్తున్నది. అడపాదడపగా 6ఏ కేసులు నమోదు చేస్తున్నా జిల్లాలో బియ్యం అక్రమ దందాకు మాత్రం తెరపడడం లేదు.

ఏఆర్‌వోలు, నోడల్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : పార్లమెంటు ఎన్నికల్లో బాధ్యతగా విధులు నిర్వర్తించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఏఆర్‌వోలు, నోడల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల్లో ఏఆర్‌వోలు, నోడల్ అధికారుల టీములు తమకు కేటాయించిన విధులను నిర్వర్తించాలని సూచించారు. సి-విజిల్ ద్వారా ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత టీములు నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. శిక్షణా కేంద్రాల్లో మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా శిక్షణకు హాజరైన వారి వివరాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. స్వీప్ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో 85 సంవత్సరాల వయస్సు పైబడినవారిని, దివ్యాంగులను సీడీపీలు గుర్తించాలని ఆదేశించారు. లక్ష రూపాయలకు పైగా డబ్బుల లావాదేవీలు జరిపితే కచ్చితంగా వివరాలు తెలియజేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఎలక్షన్ సూపరింటెండెంట్ సైదులు, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్‌చైర్మన్ బలపరీక్షలో పాల్గొన్న కౌన్సిలర్లు, ఎమ్మెల్యే రంగారెడ్డి

నెగ్గిన అవిశ్వాసం..

వైస్ చైర్మన్‌కు వ్యతిరేకంగా ఓటేసిన 16 మంది కౌన్సిలర్లు

అవిశ్వాస తీర్మానం నెగ్గింది.. కలెక్టర్‌కు నివేదికను అందిస్తాం : ఆర్డీవో

బలపరీక్షకు హాజరైన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 4 : ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్‌పై కౌన్సిలర్లు ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి చెందిన 16 మంది కౌన్సిలర్లు వైస్ చైర్మన్ ఆకుల యాదగిరిపై అవిశ్వాస తీర్మానాన్ని పెట్టగా..ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ ఆధ్వర్యంలో గురువారం ఉద యం 11 గంటలకు ప్రత్యేక సమావేశం జరిగింది. దీనికి 16 మంది కౌన్సిలర్లు క్యాంపు నుంచి నేరుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. వైస్‌చైర్మన్ కప్పరి స్రవంతితో సహా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 15 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటువేశారు. దీంతో మున్సిపల్ వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గిందని దీనిపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని ఆర్డీవో తెలిపారు. వైస్ చైర్మన్ పదవి ఖాళీ అయిన నేపథ్యంలో కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల అధికారికి ఈ సమాచారాన్ని పంపనున్నారు. ఎన్నికల అధికారి ఆదేశాలతో త్వరలో మరో సమావేశాన్ని ఏర్పాటు చేసి నూతన వైస్‌చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. ఈ మీటింగ్‌కు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా హాజరయ్యారు.

గైర్హాజరైన బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు..

ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్‌చైర్మన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన బలపరీక్షకు బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన కొంతమంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. విశ్వాస పరీక్షకు ఒక్కరోజు ముందే కౌన్సిలర్లు మమతాశ్రీనివాస్‌రెడ్డి, పద్మామల్లేశ్, ప్రసన్నలక్ష్మిలతో కలిసి వైస్ చైర్మన్ యాదగిరి రాజీనామా పత్రాన్ని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు అందజేశా రు. కాగా, రాజీనామాను ఆమోదించేందుకు మూడురోజుల గడువు ఉంటుందని తెలిసినా ముందుగా నిర్ణయించిన ప్రకారమే బలపరీక్ష నిర్వహించారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్‌చైర్మన్ యాదగిరి బలపరీక్షలో పదవిని కోల్పోయారు. దీంతో 21వ వార్డు నుంచి ఎన్నికైన బర్ల మంగాజగదీశ్ వైస్‌చైర్మన్ పదవి రేసులో ఉన్నారు.

మా పొట్ట కొట్టొద్దు!

- నిబంధనలకు విరుద్ధంగా ఇతర రాష్ట్రాల వాహనాల రాకపోకలు
- రవాణా శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే బతుకులు నాశనం
- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా.. చర్యలేవీ..?.. వాహన సంఘాల ఆగ్రహం
- కమీషన్ల కక్కుర్తితోనే అధికారులు పట్టించుకోవడం లేదంటూ విమర్శలు
- సక్రమంగా తనిఖీలు చేస్తే ప్రభుత్వానికి భారీ ఆదాయం
- నగరంలో 80 వేల మంది క్యాబ్ డ్రైవర్స్...కాంగ్రెస్ సర్కారు తీరుపై కన్నెర్ర

సిటీబ్యూరో, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ సర్కార్‌పై డ్రైవర్లు కన్నెర్ర చేస్తున్నారు. ఉపాధిని సృష్టించాల్సింది పోయి ఉన్న ఉపాధిని నాశనం చేసి.. జీవితాలను ఆగం చేస్తున్నదని మండిపడుతున్నారు. ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లు రోడ్డున పడాల్సిన దుస్థితి ఏర్పడింది. తాజాగా క్యాబ్ డ్రైవర్లూ రోడ్డున పడాల్సిన పరిస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల వాహనాలు హైదరాబాద్‌లో రాకపోకలు సాగిస్తూ ఇక్కడి డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీస్తున్నాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఐటీ కంపెనీల్లో పనిచేసే కొందరు ఇతర రాష్ట్రాల వెండర్స్ వారి కంపెనీ కార్యకలాపాలకు తమ రాష్ట్రాలకు చెందిన వాహనాలను ఇక్కడికి నిబంధనలకు విరుద్ధంగా రప్పించి వినియోగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ ప్రక్రియతో ఇక్కడి డ్రైవర్లకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నదని, ముఖ్యంగా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడుకు చెందిన సుమారు 7 వేల వాహనాలు అక్రమంగా నగరంలో తిరుగుతున్నాయని డ్రైవర్లు చెబుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మామూళ్ల మత్తులో చర్యలు తీసుకోవడం లేదని తెలంగాణ ఫోర్ వీలర్స్ అసోసియేషన్, ఆటో యూనియన్ నాయకులు ఆరోపిస్తున్నారు. నగరంలో సుమారు 80వేల మంది క్యాబ్ డ్రైవర్స్ ఉండగా.. వారంతా తమ ఉపాధిపై ఆందోళన చెందుతున్నారు.

ఖైరతాబాద్‌లోనే అధికం..

రవాణా శాఖ ప్రధాన కార్యాలయం ఖైరతాబాద్‌లోనే ఉంది. ఇక్కడ కమిషనర్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్స్, ఇద్దరు ఆర్టీవోలు ఉంటారు. ఈ పరిధిలోనే అక్రమ వాహనాలు వందల్లో తిరుగుతున్నా అధికారులకు పట్టడంలేదని ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య ఆరోపించారు. ఆర్టీవోలు ఎందుకు నిర్లక్ష్యంగా ఉంటున్నారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఏడు రోజుల కాల పరిమితితో బార్డర్ ట్యాక్స్ పేరిట ఇతర రాష్ట్రాల వాహనాలు నగరంలోకి ప్రవేశించి ఇక్కడే తిష్టవేస్తున్నాయి. మరోవైపు ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి యాప్ ఆధారిత సేవల్లోనూ ఇతర రాష్ట్రాల వాహనాలే నడుస్తున్నాయని డ్రైవర్లు చెబుతున్నారు. వాహనానికి సంబంధించి పన్నులు, ఇన్సూరెన్స్‌లు చెల్లించి ప్రభుత్వానికి రాబడి వచ్చేలా తాము చేస్తుంటే ఇతర రాష్ట్రాల వాహనాలను తనిఖీలు చేయకుండా తమ ఉపాధిని దెబ్బకొడుతున్నారని వాపోతున్నారు. బీహెచ్ఈఎల్ , ఆరాంఘర్, సీబీఎస్ తదితర ప్రాంతాల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు తిరుగుతున్నాయన్నారు.

ప్రభుత్వ ఖజానాకు గండి..

రవాణా శాఖ అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తే ప్రభుత్వ ఖజానాకు భారీ ఆదాయం సమకూరుతుంది. ఇతర రాష్ట్రాల వాహనాలు ఇక్కడ నడవాలంటే అవి వారి సొంత రాష్ట్రాల్లో టీఆర్ రద్దు చేసుకుని ఇక్కడ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఈ పన్నును ఎగవేయడం కోసం వారు అడ్డదారులు తొక్కుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ సమస్య మరింత జఠిలమై డ్రైవర్ల పాలిట శాపంగా మారింది. అంతేకాకుండా ప్రభుత్వ ఖజానాకు గండి పడుతున్నది. కొందరు ముఠాలుగామారి కొంతమంది అధికారుల ప్రోత్సాహంతో యెల్లో ట్యాక్సీ ప్లేట్ అనుమతి లేకున్నా.. సొంత వాహనాలను ప్రయాణికుల రాకపోకలకు వినియోగిస్తున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని డ్రైవర్లు వాపోతున్నారు.

సుమారు 7వేల ఇతర రాష్ట్రాల వాహనాలు..

-షేక్ సలావుద్దీన్, అధ్యక్షుడు, తెలంగాణ ఫోర్ వీలర్ అసోసియేషన్

రవాణా శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సుమారు 7వేల ఇతర రాష్ట్రాల వాహనాలు ఇక్కడ నడుస్తున్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. ఇప్పటి వరకు వాహనాలను ఎన్ని సీజ్ చేశారు? పబ్లిక్ డొమైన్‌లో కూడా ఎలాంటి వివరాలు పెట్టడం లేదు. అధికారులు మామూళ్ల మత్తులో నుంచి బయటకు రావాలి. ప్రభుత్వం స్పందించి డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి.

మా ఉపాధిని కాపాడాలి

-సంతోష్ కుమార్, క్యాబ్ డ్రైవర్

మన రాష్ట్రానికి చెందిన వాహనాలు ఇతర రాష్ట్రాలకు వెళితే అక్కడి ట్రాన్స్‌పోర్ట్ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారు. కానీ ఇక్కడ వేలాదిగా ఇతర రాష్ట్రాల వాహనాలు తిరుగుతున్నా.. పట్టించుకోవడం లేదు. అక్రమంగా ప్రయాణికులను తరలిస్తున్న నిర్వాహకులను అడ్డుకుంటే.. ఏ ఆర్టీవోకు చెప్పుకుంటావో చెప్పుకో పో అంటున్నారు. వాళ్లంతా తమ మనుషులేనని అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకొని మా డ్రైవర్ల ఉపాధిని కాపాడాలని కోరుకుంటున్నా.